క్లుప్తంగా

అందుబాటులో వరి విత్తనాలు

మాగనూర్: మండలంలోని పీఏసీఎస్ నందు వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేఎన్‌ఎం రకం ధర రూ.1005, అదే విధంగా 1010 రకం 25 కేజీల బస్తా రూ.995గా ఉందన్నారు. ఆసక్తి గల రైతులు మాగనూర్ పీఏసీఎస్ కార్యాలయంలో పాస్‌బుక్ జిరాక్స్, ఆధార్‌కార్డు జిరాక్స్‌లు సమర్పించి కొనుగోలు చేయాలని తెలిపారు.

ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ



మద్దూరు: మండల కేంద్రంలోని పలు హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, బేకరీలు, సూపర్ మార్కెట్లలో జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారిణి నీలిమ తనిఖీ నిర్వహించారు. శివ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో గడువు ముగిసిన సాస్‌లు, పౌడర్లు, ఇతర పదార్థాలు పట్టుబడ్డాయి. బేకరీల్లో చాలా రోజుల క్రితం చేసినా మోతిచూర్ లడ్డులు, ఇతర స్వీట్లను పరిశీలించి శ్యాంపుల్స్ సేకరించారు. ధనలక్ష్మి సూపర్ మార్కెట్‌లో ప్యాకింగ్ వస్తువులను పరిశీలించారు. నాణ్యతలేని వస్తువులతో తయారు చేసే పదార్థాలు తిని అనారోగ్యం పాలుకావద్దని ప్రజలకు సూచించారు. నాణ్యతలేని పదార్థాలను పరిశీలించి అక్కడే పారబోశారు. వారిపై శాఖాపరమైన కేసులు నమోదు చేస్తామని ఆమె తెలిపారు.

నేడు వాహనాల వేలం

నారాయణపేట: జిల్లా ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని వివిధ కేసుల్లో పట్టుబడిన నాలుగు వాహనాలను మంగళవారం వేలం వేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ అశోక్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆటో, మూడు ద్విచక్ర వాహనాలు వేలం వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తి కలవారు ఉదయం 11 గంటలకు ద్విచక్ర వాహనానికి రూ .2వేలు, ఆటోకు రూ.5వేలు ధరావతు చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

నేడు సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

నారాయణపేట: నియోజకవర్గంలోని మండలాలు, నారాయణపేట పట్టణానికి చెందిన 138 మంది లబ్ధిదారులకు మంగళవారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే డా.చిట్టెం పర్ణికారెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేయనున్నట్లు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ సలీం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అన్ని మండలాల అధ్యక్షులు, లబ్ధిదారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

దాడులు హేయమైన చర్య

మద్దూరు: ప్రభుత్వాధికారులపై దాడులు చేయడం హేయమైన చర్య అని పీఏసీఎస్ చైర్మన్ నర్సింహ, కోస్గి ఏఎంసీ చైర్మన్ భీములు, కాంగ్రెస్ నాయకుల బాబుస్వామి, జనార్దన్, మల్లికార్జున్, వెంకట్‌రాములుగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. విపక్షాలు ఈ ప్రాంత అభివృద్ధి కాకుండా ప్రజలను, రైతులను రెచ్చగొట్టి ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. విపక్షాలు అమాయక రైతుల రెచ్చగొట్టే ప్రయత్నాలు మానుకోవాలని పేర్కొన్నారు.

గోమాతకు ప్రత్యేక పూజలు



నారాయణపేట టౌన్: పట్టణంలోని పళ్ల ఆంజనేయ స్వామి ఆలయంలో సోమవారం విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో గోపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా గోమాతలను కడిగి పసుపు, కుంకుమలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేసి వివిధ రకాల పండ్లు గోమాతకు నైవేద్యంగా సమర్పించారు.

మహిళలకు వడ్డీలేని రుణాలివ్వాలి

దామరగిద్ద: మహిళలకు వడ్డీ లేని రుణాలు అందించాలని డిమాండ్ చేస్తూ మహిళా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మహిళాసంఘాల సభ్యులు ధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. మహిళా సంఘాల సభ్యులు అధిక సంఖ్యలో ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



ఘనంగా విద్యా దినోత్సవం



నారాయణపేటలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తున్న ప్రిన్సిపల్ ఖాజా మహబూబ్‌ఖాన్



ధన్వాడలో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయురాలు



ఊట్కూర్‌లో మౌలాన అబుల్ కలాం అజాద్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

సాక్షి, నెట్‌వర్క్: భారత మొదటి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి పురస్కరించుకుని జాతీయ విద్యా దినోత్సవం, మైనారిటీ సంక్షేమ దినోత్సవం సోమవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని మైనారిటీ బాలుర గురుకుల పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు ఉపన్యాసం, నృత్యాలు, నాటక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ ఖాజా మహబూబ్‌ఖాన్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీ నెహ్రూలతో కలిసి మౌలానా అబుల్ కలాం ఆజాద్ అసాధారణ పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో సిబ్బంది కాశీం హుస్సేన్, శివకుమార్ గౌడ్, సుదర్శన్, ఖదీర్, హరీష్, నారాయణ, పవన్ సిరాజుద్దీన్, హన్మంతు, ఖాజామైనోద్దీన్, హిరణ్, విజయభాస్కర్, నివేదిత, అపర్ణ, ఫరీదా తదితరులు పాల్గొన్నారు.

● ధన్వాడ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ అబ్దుల్ ముజీబ్ మాట్లాడుతూ విద్యార్థులలో ప్రతిభని వెలికితీసేందుకు కళాశాలలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పోటీల్లో విజేతల గ్రూప్‌లకు మెడల్స్ ప్రదానం చేశారు. ఇందులో అధ్యాపకులు సాంబశివుడు, నివాస్, వరలక్ష్మి, శివయ్య, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

● ఊట్కూరు మండల కేంద్రంలోని సీపీఎస్ ఉర్దూ మీడియం పాఠశాలలో జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జన్మదినం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్కూల్‌కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు కుసుమ మాట్లాడుతూ అబుల్‌కలాం ఆజాద్ విద్యాశాఖ మంత్రిగా దేశానికి ఎనలేని సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సలాం, పీఆర్‌టీయు మండల గౌరవ అధ్యక్షులు పజల్, ఉపాధ్యాయులు లియాకత్, జహిరీబేగం, మగ్బుల్‌అలీ, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను సన్మానించిన కలెక్టర్



కర్ని పాఠశాలకు చెందిన విద్యార్థులను సన్మానిస్తున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్

మక్తల్: మండలంలోని కర్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఖోఖో క్రీడాకారిణి శిరేఖ, జాతీయ స్థాయిలో రజత పతకం సాధించిన రుక్సానాబేగంలను సోమవారం కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఘనంగా సన్మానించి అభినందించారు. అనంతరం విద్యార్థులకు సహకారం చేసిన పాఠశాల పీఈటీ బి.రూపను సన్మానం చేశారు. విద్యార్థులు చదవుతో పాటు క్రీడల్లో రాణిస్తే విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఈఓ అబ్దుల్‌గనీ, ఎంఈఓ విద్యాసాగర్, ఎస్‌ఓ శ్రీనివాసులు, జీహెచ్‌ఎం వెంకటయ్య, కరాటే మాస్టర్ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యా, ఉద్యోగ అవకాశాలకు ప్రమాదం

నర్వ: అర్హులైన ఎస్సీలకు విద్యా, ఉద్యోగ, ఆర్థిక అవకాశాలను కొల్లగొట్టే ప్రమాదం ఉందని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు శరణప్ప, గుడిసె వెంకటయ్యలు అన్నారు. సోమవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నర్వ తహసీల్దార్, ఎంపీడీఓ, పోలీస్ శాఖకు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేలో బీసీ 'బి' గ్రూప్‌లోని కురుమ కులస్తులు సామాజికంగా, ఆర్థికంగా ఎదిగిన వారు ఉన్నప్పటికి ఎస్సీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మాదాసి, మాదారి కురువలు పేర్లతో దొడ్డి దారిన ఎస్సీ సర్టిఫికెట్స్ పొందుతున్నారని ఆరోపించారు. ఇలాంటి వారు సర్వేలో తప్పుడు సమాచారంతో ఎస్సీలుగా నమోదు చేయించుకోవడం సమంజసం కాదన్నారు. ఈ సర్వేలో ఎక్కడా ఎస్సీ జాబితాలో వీరిని నమోదు చేయరాదని ఎంపీడీఓ శ్రీనువాసులు, తహసీల్దార్ మల్లారెడ్డి, పోలీస్ శాఖకు వినతిపత్రం అందించామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, కాంగ్రెస్ నాయకులు గుడిసె వెంకటయ్య, శరణప్ప,శివకుమార్, రాము, బుడ్డన్న, గోపాల్, రాజ్‌కుమార్, శ్రీను, డీఎస్పీ నాయకులు ఈశ్వర్, సురేష్, దండు రామంజనేయులు తదితరులున్నారు.



నర్వ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయండి

మక్తల్: మండల కేంద్రంలో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని మక్తల్ అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మక్తల్‌లో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు కోసం స్టేట్ కార్యదర్శికి విషయం పంపించి మక్తల్లో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. యువజన సంఘం అధ్యక్షుడు పృథ్వీరాజ్, శ్రీహరి, తేజ, వర్ధన్, చందర్, రమేష్ పాల్గొన్నారు.



డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

మరికల్: మండలంలోని కన్మనూర్ గ్రామంలో రాజకీయ నాయకుల ప్రమేయంతో ఓటర్ జాబితాను మార్చిన పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని సోమవారం ట్రైనీ కలెక్టర్ గరిమ నరులకు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. గతంలో ఒక వార్డులో ఉన్న ఓట్లను నాయకులు పోటీ చేసే వార్డుకు కార్యదర్శితో మార్పించుకోవడం చట్ట విరుద్ధమన్నారు. నాయకులతో కుమ్మకై ఒకే కుటుంబంలో భర్త ఒక వార్డులో ఓటు కల్పించి, భార్యకు మరో వార్డులో ఓటు కల్పించేలా జాబితాను రూపొందించిన కార్యదర్శిని సస్పెండ్ చేయాలని ఎంపీడీఓ కొండన్నకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాజేష్, నవీన్‌గౌడ్, హరికాంత్‌రెడ్డి, మణికంఠగౌడ్, రవికుమార్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్ రెడ్డి, గోపాల్‌లు పాల్గొన్నారు.



ట్రైనీ కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న కన్మనూర్ గ్రామస్తులు

తల్లిదండ్రుల సమావేశానికి ఆహ్వానం

మాగనూర్: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల, విద్యాభివృద్ధికి తల్లిదండ్రులు సహకారం అందించాలని మాగనూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు వెంకటస్వామి అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతినెల నిర్వహించే సమావేశం కోసం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ సమావేశానికి హాజరుకావాలని విద్యార్థుల తల్లిదండ్రులను ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వి ద్యార్థులు పాఠశాలతో పాటు ఇంటి దగ్గర చదివే విధంగా తల్లిదండ్రులు చూడాలన్నారు. పాఠశాలలో 14న నిర్వహించే సమావేశానికి వారు హాజరై సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాఘవేంద్రచారి, పీడీ రాకేష్ పాల్గొన్నారు.



కొత్తపల్లి గ్రామంలో తల్లిదండ్రులను ఆహ్వానిస్తున్న ఉపాధ్యాయులు

సదర్ ఉత్సవాలకు సీఎంకు ఆహ్వానం



కోస్గి: 13న కోస్గిలో పెద్ద ఎత్తున నిర్వహించనున్న సదర్ ఉత్సవాల నేపథ్యంలో సోమవారం యాదవ సంఘం ప్రతినిధులు సీఎం రేవంత్ రెడ్డిని కలిసి ఉత్సవాల ఆహ్వానం అందించారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో ఆయనను కలిసి సొంత నియోజకవర్గంలో నిర్వహిస్తున్న సదర్ ఉత్సవాలకు హాజరు కావాలని కోరారు. ఇదే కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డికి సైతం ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో యాదవ సంఘం ప్రతినిధులు పీరంపల్లి శ్రీనివాస్, వెంకటేష్, హన్మంతు, నర్సింహులు, గుర్రం హన్మంతు, మహిపాల్, శ్రీనివాస్‌తో పాటు పలువురు ఉన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం



దామరగిద్ద: మండలంలోని దేశాయ్‌పల్లిలో సోమవారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ అధ్యక్షుడు ఈదప్ప మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సన్నరకం వరి ధాన్యానికి రూ.500 బోనస్ అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో విండో డైరెక్టర్ మల్లప్ప, శరణ్‌నాయక్, శ్రీనివాస్, ఖాజామియా, ఆనంద్, బసంత్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సంప్రదాయ కళలకు పుట్టినిల్లు బాలకేంద్రాలు



నృత్యం చేస్తున్న విద్యార్థులు

నారాయణపేట: సంప్రదాయ కళలకు పుట్టినిల్లు బాలకేంద్రాలని డీఈఓ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ ఉదయబాను, ప్రధానోపాధ్యాయులు కె నారాయణ అన్నారు సోమవారం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని బాలకేంద్రం ఆధ్వర్యంలో పట్టణంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు నిర్వహించిన బృంద నృత్యం పోటీలలో 12గ్రూపులు పాల్గొని పోటాపోటీగా నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు ప్రభుత్వం బాలకేంద్రాలను స్థాపించిందన్నారు. సంప్రదాయ కళలను నేర్పిస్తున్న బాలకేంద్రాలకు విద్యార్థులు వెళ్లి సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ బృంద నృత్య పోటీలలో విజేతలుగా మొదటి బహుమతి కల్యాణి గ్రూప్ (శ్రీసాయి ఉన్నత పాఠశాల) ద్వితీయ బహుమతి అరుణ గ్రూప్ (దయానంద్ విద్యమందిర్)తృతీయ బహుమతి మౌనిక గ్రూప్ (వైదిక ఉన్నత పాఠశాల) విద్యార్థులు కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో బాలకేంద్ర సూపరింటెండెంట్ మహిపాల్ రెడ్డి, సంగ నర్సింహులు, వసంత్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు బృంద గీతాల పోటీలు

బాలలదినోత్సవం సందర్భంగా బాలకేంద్రంలో మంగళవారం మధ్యాహ్నం 2గంటలకు బృంద గీతాల పోటీలు నిర్వహిస్తున్నామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని బాలకేంద్ర సూపరింటెండెంట్ మహిపాల్ రెడ్డి కోరారు.

ప్రభుత్వం ప్రతిగింజనూ కొనాలి

● ఎంపీ డీకే అరుణ

మక్తల్: కారణాలతో వేధించకుండా రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. సోమవారం మండలంలోని జక్లేర్‌లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీ పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కొనుగోలు ప్రారంభించి 9 రోజులు అయినా వరిధాన్యం కొనుగోలు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. కొనుగోలు కేంద్రంలో పిచ్చి మొక్కలు, గడ్డిలో ధాన్యం ఎలా ఆరబెట్టుకోవాలని అసంతృప్తి వ్యక్తం చేశారు. జక్లేర్ కొనుగోలు కేంద్రంలో రైతులకు సరైన సౌకర్యాలు లేకపోవడంతో అధికారులపై తీవ్రంగా అగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంటు పరిధిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కగింజ కూడా కొనలేదన్నారు. వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల కష్టాలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలియడం లేదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాంచంద్రారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, రాష్ట్ర నాయకుడు నాగురావు నామోజీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లక్ష్మీకాంత్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ బాల్‌రాంరెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ కర్నిస్వామి, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



జక్లేర్‌ల్లో కొనుగోలు కేంద్రంలో వరిధాన్యం పరిశీలిస్తున్న ఎంపీ డీకే అరుణ

మధ్యవర్తులను తీసుకురావొద్దు

డీఎస్పీ ఎన్. లింగయ్య

నారాయణపేట: పోలీస్ స్టేషన్లకు ఆపై పోలీస్ కార్యాలయాలకు వచ్చే ఫిర్యాదుదారులు మధ్యవర్తులని తీసుకురావద్దని, బాధితులు మాత్రమే నేరుగా వచ్చి ఫిర్యాదు చేయాలని డీఎస్పీ ఎన్. లింగయ్య సూచించారు. గ్రీవెన్స్ డే లో భాగంగా సోమవారం సబ్‌డివిజన్ పోలీస్ కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 5 మంది అర్జిదారులతో డీఎస్పీ ఫిర్యాదులు స్వీకరించారు. బాధితులకు సత్వరన్యాయం చేయాలని సీఐలు, ఎస్‌ఐలకు ఫోన్‌లో సూచించారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. పోలీస్ స్టేషన్‌కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించాలన్నారు. సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి బాధితులకు న్యాయం అందేలా కృషి చేస్తామని తెలిపారు.



బాధితుడితో సమస్యలు వింటున్న డీఎస్పీ ఎన్.లింగయ్య

ముమ్మరంగా సమగ్ర కుటుంబ సర్వే



కొత్తపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న అధికారులు



ఊట్కూరులో సమగ్ర సర్వేను పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి, నెట్‌వర్క్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే మాగనూర్ మండలంలోని 16 గ్రామ పంచాయతీలలో ముమ్మరంగా సాగుతోందని మండల ప్రత్యేక అధికారి ఈశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన ఎంపీడీఓ రహమతుద్దీన్‌తో కలిసి మండలంలోని గురువలింగంపల్లి, తంకేరి, కొత్తపల్లి గ్రామాల్లో సర్వేను పరిశీలించారు. ఆయా గ్రామాల ప్రంచాయతీ కార్యదర్శులు, సూపర్‌వైజర్లు, పాల్గొన్నారు.

⇨ ఊట్కూరు మండలంలో మూడో రోజు ఇంటింటి సమగ్ర సర్వే కొనసాగింది. తహసీల్దార్ రవి, ఎంపీడీఓ ధనుంజయ్యగౌడ్, తదితరులు సర్వేను పరిశీలించారు.

⇨ మక్తల్ మండలం కాట్రేవ్‌పల్లి, మంతన్‌గోడ్ గ్రామాలతో పాటు మాద్వార్, సోమేశ్వర్‌బండ, కాచ్‌వార్, గొల్లపల్లి, కర్ని, ఖానాపూర్, లింగంపల్లి , భూత్పూర్, సత్యావార్ , గుడిగండ్ల, అనుగొండ, ముష్టిపల్లి, ముస్లాయిపల్లి గ్రామాల్లో సర్వే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఎంపీడీఓ రమేష్, కమిషనర్ భోగేశ్వర్‌లు సర్వేను పరిశీలించారు.

⇨ మద్దూరు మండలంలోని భీంపూర్, దమ్గ్నాపూర్‌లో ఎంపీడీఓ నర్సింహారెడ్డి, ఎంపీఓ రామన్న సర్వేను పరిశీలించారు. ఉమ్మడి మండలంలో మూడు రోజులకు 3,364 కుటుంబాలను సర్వే చేసినట్లు తెలిపారు.

జిల్లా అధికారులపై దాడి వెనుక బీఆర్‌ఎస్ కుట్ర

కోస్గి: ఫార్మా కంపెనీ నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులు, గ్రామస్తులతో సమావేశమై ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డిలపై దాడి చేసిన ఘటనలో బీఆర్‌ఎస్ కుట్ర ఉందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఫార్మా బాధితుల ముసుగులో కొందరు బీఆర్‌ఎస్ చెందిన వారు ఉద్దేశ్య పూర్వకంగా ముందస్తు ప్రణాళికలో కర్రలు, రాళ్లతో దాడి చేశారన్నారు. దాడికి పాల్పడిన కొందరు యువకులను అధికారులు గుర్తించారని, వారు గతంలో కేటీఆర్, మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డితో కలిసి దిగిన ఫొటోలు వెలుగులోకి వచ్చాయన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

'ఉపాధి' పనులపై సామాజిక తనిఖీ

అమరచింత: మండలంలోని అన్ని గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ నిర్వహించి, తగు నివేదికలు అందించాలని అంబుడ్స్‌పర్సన్ సత్యనారాయణరెడ్డి కోరారు. ఎంపీడీఓ సమావేశ మందిరంలో సోమవారం ఉపాధి పనులపై చేపట్టాల్సిన సామాజిక తనిఖీ కోసం వచ్చిన డీఆర్‌పీ, సీఆర్‌టీలకు అవగాహన కల్పించారు. 2023-2024 ఆర్థిక సంవత్సరంలో జాతీయ ఉపాధి హామీ నిధులతో గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలతో పాటు పనిచేసిన కూలీలకు వేతనాలు అందాయ లేదా అన్న విషయాలను సేకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంపీఓ నరసింహులు, ఇంచార్జి ఎపీఓ రఘుతో పాటు పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.